కథానిక

# సీటు కోసం....

యం వై. రెడ్డి

“అబ్బ! నా జీవితం అంధకారబంధురం!” అనుకున్నాడు రంగయ్య, నిస్పృహతో నీరసమైన తన చేతిని నొసటికి చేర్చుతూ. అతనలా అనుకొనుటకు చాలకారణము లున్నాయి. అవును. తన ఊహాసౌధం నేలమట్టమయింది! అదే ప్రధాన కారణం. తన ఊహాసౌధాన్ని నిజమైన సౌధంగా మారుద్దామనుకున్నాడు. అలాంటి ఊహాలే చివరకు అతని మనస్సును నిస్పృహతో నింపాయి. కాదు అతను ఊహాలనే భోంచేయలేదు; కావలసినంత కృషి చేశాడు. కాని కృషి వ్యర్థమయింది. అతని కృషిని ఇతరులు తీరికగా వ్యర్థంచేశారు; స్వార్థం కోసం ఇతరులు అలా చేశారు. ఇతరులు వారెవరో ఫలానా వారని రంగయ్య చెప్పలేదు. కాని అతనికి తెలుసు ఆ ఇతరులెవరైందీ!

“నేను డాక్టరును కావాలి; అవుతాను” అనే ఆలోచన అతన్ని మూడునెలలక్రితం మైమరపించింది. ఆ ఆలోచనను ఆశగా పెంచుకున్నాడు. “క్రాస్‌వర్డ్ ఫజిల్స్” లోని లక్షరూపాయలూ తనకే కావాలనేటటువంటి ఆశకాదది. ఆ ఆశ ఈరోజువరకు విచ్చలవిడిగా పెరిగింది; చివరకు సమూలంగా పెకలించి వేయబడింది.

ఫస్టుక్లాసులో పాసయిన రోజునుంచి, ఈరోజు వరకూ తీయని కలలు కన్నాడు. ఆ మధుర స్వప్నాలు చివరకు విషాదాన్నిమాత్రం ఫలితంగా చేకూర్చాయి. అతను ఇంటర్మీడియేటు ఫస్టుక్లాసులో పాసయ్యాడు. అందులో గ్రూపులో, ప్రతిసబ్జక్టులోను “డిస్టిన్‌క్షన్”మార్కులువచ్చాయి. అనేకులు అన్నారు, అతనికి తప్పకుండా యం. బి. బి. యస్‌కు సీటు దొరుకుతుందని. కాని వారందరితోపాటు రంగయ్యకూడా మోసపోయాడు. చివరకు అతని సీటు రాలేదు!

తనకు సీటురానందుకు విచారించాడు రంగయ్య; ఆశ్చర్యమొందాడు. ఇంటర్మీడియేటుమీద నాలుగురులు దండయాత్రలు జరిపి, చివరకు వెంట్రుకవాసిలో విజయమొందిన ప్రభుదాస్‌కు సీటు వచ్చిందనే వార్త, అతని ఆశ్చర్యమును ద్విగుణీకృతమొనర్చినది. అందరూ ఆశ్చర్యపడినారు. రంగయ్యకు సీటు లేకపోవటానికి, ప్రభుదాస్‌కు సీటు ఉండటానికి. ఇలాంటి అవకతవకలకు కారణాలు అందరికీ తెలుసు. ఆ అవకతవకలకు కారకులెవరైందీ స్పష్టంగా గోచరిస్తున్నప్పటికిని, రాజ్యాంగమందరికీ వాక్‌స్వాతంత్ర్య మిస్తున్నప్పటికిని, ఎవరూ ఆ అన్యాయాన్ని ఖండించబూనుకోరు. ఒకవేళ పూనుకొనినా ఖండించబడేవారెవరూ లేరు!

అసలు రంగయ్యకు యం. బి. బి. యస్ చదివే ఆర్థికస్తోమతు లేదు. అతని ఆశ, డాక్టరీలో చేరిన తరువాత ఎవడో ఒకడు పెండ్లిచేసి చదివిస్తాడని.

రంగయ్య తన దురదృష్టమునకు (క్షమించండి! అదృష్టమనేదంటూ ఒకటుంటే) వగచాడు. అలా వగచేవారెందరో! వారికి సానుభూతి కనపరిచేవారంటూ ఎవరూ వుండరు. అథవా ఎవరైనా ఉన్నా వారిని అసూయాపరులని ఇతర్లు అసూయతో ద్వేషిస్తారు.రంగయ్య తనకు యం. బి.కి సీటు వస్తుందనే ధీమాతో బి. యస్. సి. (ఆనర్స్) కోర్సుకు సీటు వచ్చినప్పటికిని ఇచ్ఛాపూర్వకముగా వదిలేశాడు. “బుద్ధితక్కువ పని” అని తనను తానే నిందించుకున్నాడు. “ఇప్పుడేమి చేయాలి?” అనే ప్రశ్న అతనిని నిలువదీసి అడిగింది. సమాధానం కోసం తడువుకున్నాడు. “ఏం చేయాలి...ఏంచేయాలి” అనే ప్రశ్న, అతనిని ప్రతి దిక్కునుండి ముట్టడించింది. ఆ ముట్టడినుండి పలాయన మవటంకోసం ఆలోచించ ప్రారంభించేడు. “బి. ఏ. బి. కాం., వీనిలో ఏది చదవాలి?” అనే ప్రశ్న అతనికి తలనొప్పిని ఉచితంగా తెచ్చింది. అతనికి వెంటనే పత్రికలలో ఉచితము అనే కాలంలో పడే ప్రకటనలు జ్ఞాపకంవచ్చి, ఉచితంగా నవ్వునుమాత్రం

సమకూర్చాయి. బి. ఏ. లేక బి. యస్. సి. చదివి ఏంచేయాలి? మహా అవుతే గుమస్తాగిరీ వెలిగించాలి. కానీ, ఏదోఒకటి చదువుదామనుకున్నాడు. "ఆ గుమాస్తాగిరీ అయినా వస్తుందో లేదో" అనే అనుమానం అతని మనోదృష్టియందు ఏడ్వలేక నవ్వుతున్న నిరుద్యోగుల ననేకమందిని హాజరుపరిచింది. "అబ్బ! దుర్భరంకదా నిరుద్యోగం" అనుకున్నాడు.

"ఆ బి. ఏ.లోనైనా ఇంకా ఖాళీలున్నాయా! మొన్న బి. ఏ. లో కొంతమందిని 'Waiting list'లో ఉంచారటనే! జూలై 15వ తారీఖున నాకు సీటు ఎవడిస్తాడు? నేను అధమా ఒక పల్లెటూరి పంచాయితీబోర్డు మెంబరుగారి కుమారరత్నమును కూడా కాదుగదా!" అనుమాన పరంపరలు అతనిని తీవ్రంగా బాధించ మొదలెట్టాయి. తన భవిష్యత్తును గూర్చిన ఆలోచనలనుండి విముక్తి లభించే సూచనలు లేనందువలన, తాను సీటుకోసం పడిన తిప్పలను నెమరువేయ ప్రారంభించాడు.

రంగయ్య దరఖాస్తు ఫారంకొరకు యెంతో ఆతురత చూపవలసి వచ్చింది. గడువు తేదీ పండ్రెండు రోజు లుండగా దరఖాస్తు ఫారంకొరకు అర్ధరూపాయి ముడుపు చెల్లించాడు. తన భవిష్యజ్జీవితము కోసం ఆ రోజు ధనముతో నాందీ ప్రస్తావన చేశాడు. ముడుపుచెల్లించిన మరు రోజు పల్లెటూరి పోస్టాఫీసుదగ్గర హాజరయ్యేవాడు. అగుపడిన ప్రతి స్నేహితుని అడిగేవాడు "ఏమోయ్! దరఖాస్తున కొక అర్ధరూక, తపాలశాఖవారి కొక అర్ధరూక, వెరసి ఒకరూక, మన జేబులోనిది పోయినది. ఇంకా దరఖాస్తుఫారం రాలేదెందుకు" ఆ ప్రశ్నకు సమాధానం నిశ్శబ్దం.

చివరకు ఏలాగవుతే ఏం, దరఖాస్తు ఫారం వచ్చింది; అప్పటికి గడువు తేదీ వారంరోజులుంది ఆ గడువు తేదీ 18 జూలై. తాను అధమం దరఖాస్తు 16వ తేదీన పంపాలి. 16వ తేదీ నాలుగు దినముల వ్యవధిలో ఉండి, అత్యంత శీఘ్ర గమనముతో చేరువకు చేరుతోంది. దరఖాస్తు ఫారం వచ్చిందనే సంతోషంతో ఆ రోజున వ్యర్థం చేశాడు. "గడిచిన కాలం రాదు" అనే సూక్తి అతనికి జ్ఞాపకం లేనట్లుంది. మరుసటి రోజు, తాను సేకరించవలసిన సర్టిఫికెట్లను తలచుకొనునప్పటికి, రంగయ్యకు గుండె ఆగినంత పనిఅయింది. 'కాండక్టు' మార్కులు, ట్రాన్స్‌ఫర్, నివాసస్థలము, ఫిజికల్ ఫిట్‌నెస్' ఇన్ని సర్టిఫికెట్లను తను సేకరించాలి! "ఎంత కష్టం" అనుకున్నాడు.

మరునాడు, గ్రామమునసబుదగ్గర నివాసస్థలము సర్టిఫికెటు తీసుకుని, జేబులోనున్న పదిరూకల నోటు నొక్కి పరివీక్షించి, తానున్న కుగ్రామము నుండి తాలూకా కేంద్రమునకు బయల్దేరాడు రంగయ్య. ఒక రూపాయి బస్సువారికి దానమిచ్చి తన గమ్యస్థానాన్ని చేరాడు. పట్టణంలో అడుగు మోపీ, మోపకముందే అతని ఆలోచన టైపు మీదికి పోయింది. టైపిస్టు దగ్గరకి చేరాడు అత్యంత ధైర్యంగా "ఎంత తీసుకుంటూరు ఈ సర్టిఫికెట్లను టైపు చేయటానికి? ప్రతిదానికి ఒక్కొక్క కాపీ కావాలి!" "అధమం ఒక రూపాయి అయినా ఇవ్వాలి. చూడండి! మార్కులు...ట్రాన్స్‌ఫర్... కాండక్టు...అన్ని సర్టిఫికెట్లు" నసుగుతూ అడిగాడు టైపిస్టు చివరకు పండ్రెండు అణాలకు బేరం కుదిరింది.

పది గంటలకు డిస్ట్రిక్టకలెక్టరుగారి దర్శనభాగ్యం కోసం సహస్ర నేత్రములతో ఆయన గృహము ముందు అడుగుపెట్టాడు. ద్వారపర్యకుడు జవాను అత్యంత ఠీవితో రంగయ్యను ఎదుర్కొన్నాడు. రంగయ్య అడిగాడు. "డిస్ట్రిక్టకలెక్టరుగారున్నారా? పనుంది." "అమ్మగారికి జ్వరం వచ్చింది. దొరగారు ఇవ్వాళ ఎవరితోను మాటాడరు!" అంటూ వెనుదిరిగాడు జవాను సాహేబు రెండడుగులు మాత్రము ముందుకువేసి, మరల వెనుకకు తిరిగి, రంగయ్య ముఖముపై క్షణంపాటు దృష్టినిలిపి, దరస్మిత వికసిత కపోలుడై, మరుక్షణము జేబుపై దృష్టినిలిపాడు. ఆ చిరునవ్వుయొక్క అర్థం రంగయ్యకు తెలుసు జేబులోనికి హస్తమును జొనిపి, బేడనాణెము తీసాడు. "అబ్బె, అబ్బె, మీరుకూడ ఇలాచేస్తే ఎలాగండీ! మిమ్మలను ధిక్కరించలేక తీసుకుంటున్నాను" నసుగుతూ చేయిజాపాడు జవాను తరువాత అన్నాడు "దొరగారు పదకొండు గంటలకు కాని రారు. కాస్సేపు నిలబడండి. టపా చూసుకునేటప్పుడు పిలుస్తాను" అంటూ ద్వారరక్షణకు బయల్దేరాడు.

పన్నెండు గంటలకు దొరగారి దర్శనమయింది. "హు! ఎందుకొచ్చినట్లు నువ్వు? ఏంకావాలి?" ముఖారవిందం పైకెత్తకుండా హుంకరించాడు డిప్టీ కలెక్టరు. "సార్! నేటివిటీ సర్టిఫికేటు కోసం వచ్చాను." 'మునసబుదగ్గర సర్టిఫికేటు తెచ్చావా?' "తెచ్చానండి." "అందరు మామీద వచ్చిపడితే ఎలాగయ్యా? తాసిల్దారు దగ్గరకిపో!" కోపం చూపిస్తున్నాడు దొర. "లేదండి! గజెటెడ్ ఆఫీసరు మాత్రమే సంతకం చేయాలి!" బ్రతిమాలే ధోరణిలో అన్నాడు రంగయ్య. "మునసబు సర్టిఫికేటు ఇలాతే!" ఇచ్చాడు రంగయ్య. డిప్టీకలెక్టరు తిప్పలుపెట్టక మానలేదు. "ఈ మునసబు సంతకం నాకు తెలియదు. అనుమానంగా వుంది; పోయి, రెవిన్యూ ఇన్‌స్పెక్టరుచేత, తరువాత తాసిల్దారు చేత సంతకం చేయించుకుని తీసుకురా!" "ఈ ట్రూ కాపీలలోనైనా సంతకం చేయండి." "అన్నిపనులు మేమే చేయాలా, ఏమయ్యా!" దొరవారు మాటలు పూర్తి చేయకముందే తప్పుకున్నాడు రంగయ్య.

ఒంటి గంటకు నిరాశాపూరితమైన హృదయంతో, పట్టణమంతా వెదకి తమ ఫిర్కాకు చెందిన రెవిన్యూ ఇన్‌స్పెక్టరుచేత సంతకం చేయించి తాసిల్దారువారి గృహమున కేగునప్పటికి, ఆయనగారు క్యాంపు వెళ్ళటానికి సిద్ధమవుతున్నారు. ఆయన కరుణార్ద్ర హృదయునిలా ఉన్నారు! దగ్గరకుపిలిచి, అనేక ఉచిత సలహాలు మంజూరుచేసి, ఆఖరుకు సంతకం చేసేటప్పటికి 30 నిముషములైనా పట్టేవుంటుంది. వెంటనే రంగయ్య తన ధూళి ధూసరితములైన పాదములను డిప్టీకలెక్టరుగారి గృహమున కేగ ఆజ్ఞాపించాడు. పాదములు ఆ కఠోరమైన ఆజ్ఞను ధిక్కరించలేక మెల్లగా ముందుకు సాగినవి. డిప్టీకలెక్టరుగారి ఇంటిలో పనిచేయుచున్న జవాను (మొదటి జవాను కాదు) రంగయ్యను చూచి లోపలినుండి అరిచాడు. "దొరవారు క్యాంపు కెళ్ళారు. రేపు మూడుగంటలకు వస్తారు. పో... పో...పో!"

"ఓరి భగవంతుడా! ఎంత నిర్దయుడవు నీవు దొరవారిచేత ఆ తిట్లలోనే రేపు రమ్మని పలికించ కూడదా? నేను డాక్టరును అవకున్నా ఫరవాలేదు. ఈ కష్టాలన్నింటినీ ఎవరు సహిస్తారు?" అనుకుంటూ వ్యధితహృదయంతో తాలూకాఫీసులో అడుగు పెట్టాడు.

తాలూకాఫీసులో, అడుగిడిన మరుక్షణంలో, ఎక్కడినుంచో,తననే సంభోదిస్తూ ఒక గావుకేక వినపడింది. తనశరీరాన్ని కొద్దిగామరలించేటప్పటికి చిరకాల స్నేహితుడు సత్యనారాయణ సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు వరండాలో నిలబడి, తన చేతిని తెగ ఊపుతున్నాడు. "తప్పదురా" అనుకుంటూ, మెల్లగా పడుతున్న తన పాదాలకు కొద్దిగా హుషారు కల్పించాడు. "ఏరా సత్యం, ఏందుకొచ్చినట్లు?" "అబద్ధంలేదు...సత్యంలేదు ... ఓరేవ్ రంగూ, అటుచూడరా! ప్రభుత్వోద్యోగులు ఎంత కార్యతత్పరులై పనిచేస్తున్నారో! ప్రభుత్వంయొక్క ఉప్పుపులుసు తిని బ్రతుకుతూ, ఏకహస్తముతో పనిచేసి, కృతఘ్నులు కాకుండా, రెండుచేతులతో ఎలా పనిచేస్తున్నారో! ఆ గుమస్తాయొక్క ఎడమహస్తాంబుజమును చూడరా! ఎక్కడైనా నీవు అంబుజమువంటి చేయి చూడాలంటే ఇంతకన్న నీకు మంచి అవకాశం దొరకదు. ఆ ఎడమచేయి ఎంత సున్నితంగా ఉంది! ధనములాంటి సున్నితపు వస్తువులను తాకుచుండుటవలన వానిచేయి అంత సున్నితంగా తయారయింది. ఆ! ఆ! ఇప్పుడు చూడు!...ఆ చేయి అదనపు పైకాన్ని (లంచం అనేమాట సరైనది కాదుట) ట్రాజరు జేబులోనికి ఎలా చేరవస్తుందో ప్రతివాడు చూచి ఆనందించవలసిన దృశ్యంరా! నేను వర్డ్సువర్తును అవుతే తెగ వర్ణించేవాడిని! ఆ సబ్-రిజిష్ట్రార్, మిగతా గుమాస్తాల సంగతిచూడు. సాయంత్రమునకు అదనపు పైకము ఎక్కువగా వచ్చేట్లుందని ఎంత సంతోషిస్తున్నారో! అందుకే, ఈ ఆఫీసులలో ఉద్యోగమంటే పడిచస్తారు!" ఆగింది సత్యనారాయణ వాగ్ధోరణి.

అంతావిని రంగయ్య అడిగాడు "ఎందుకొచ్చినట్లు నీవిక్కడికి?" సత్యం జవాబిచ్చాడు. "నేను 24వ ఏట ప్రవేశించాను. సర్వీసు కమిషనుకు మూడు సారులు కూర్చుని కూడా సెలెక్టవలేదు, చూస్తే పుణ్యకాలం కాస్త గడిచేలాఉంది. అందుకని వయస్సు మార్చటానికి వీలుంటుందేమోనని వచ్చాను. రెండు రూపాయలు తీసుకుపో

యాడు రికార్డు కీపరు జనన తేదీ చూడటానికి!" "ఓహో, అలాగ! నేను 5 రూపాయలు ముడుపు చెల్లించాలి; పోదాం పద తాలూకాఫీసుకి."

మిత్రద్వయం తాలూకాఫీసుకు బయల్దేరింది. అప్పటికి ట్రెజరీదగ్గర చాల తలకాయలు చేరి ఉన్నాయి. అందులో రెండు డజనులు విద్యార్థులవి అనేక కోర్సులకు, పరీక్షలకు ముడుపులు చెల్లించటానికి వచ్చిన తలకాయలవి. నల్దిక్కులను పరికించాడు రంగయ్య. ఆఫీసు అంతా కిటకిట మంటోంది మునసబులతో, కరణములతో వరండాలో ఒకమూల, ఒకరైతు గుమాస్తా చేతిలో అయిదు రూపాయలు ఉంచుతున్నాడు. జవానులు తమ మామూళ్ళు వసూలు చేసుకుంటున్నారు. ఈ దృశ్యాన్ని తిలకిస్తూ చలాన్ ఫారం పూర్తిచేయ ప్రారంభించాడు రంగయ్య. సిరస్‌దారు గదిలో అడుగు పెట్టబోయేటప్పటికి ఎదురయ్యాడు జవాన్ "ఏవయ్యోయ్ నిన్నే! ఏం పడి తోసుకుపోతున్నావ్? ఇవాళ తీరికలేదు; రేపురా!" అంటూన్న జవాను చేతిలోఒక పావలా పెట్టాడు రంగయ్య.

అంతలో సిరస్‌దార్ గదిలో జరుగుతున్న సంభాషణ రంగయ్య దృష్టిని ఆకర్షించింది. అందులో తన స్నేహితుడు సులేమాను సిరస్‌దారును బ్రతిమిలాడటం అతన్ని ఆశ్చర్యపరిచింది. సులేమాను రెండునెలలక్రితంవరకు నిరుద్యోగి. రెండు నెలలు మాత్రం తాత్కాలికోద్యోగి. సులేమాను రంగయ్యను పలుకరించాడు. "చూచావుగా. ఒక గంటక్రితమే ఇంకొకనికి నాలుగురోజులు అనుమతి నిచ్చాడు. వాడు కాస్త ముట్టజెప్పాడులే! మనం తడి చేయలేదు కనుక..."

రంగయ్య ఐదుగంటలవరకు వేచి ఉండవలసి వచ్చింది చలాన్ చెల్లించటానికి. పుణ్యకాలంలో యింకొకరోజు ఖర్చయి పోయింది. ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెటుకోసం మెడికల్ ప్రాక్టీషనరు దగ్గరకు వెళ్ళవలసి వచ్చింది. డాక్టరు నిశ్చయ ధ్వనిలో అన్నాడు. "ఫీజు అయిదు రూపాయలు. అయిదు రూపాయలు అక్కడపెట్టి సర్టిఫికెటు తీసుకెళ్ళండి!' 'రంగయ్య ఏడ్వలేక అయిదు రూపాయలు ధారపోశాడు. పరీక్షించకుండానే డాక్టరు సర్టిఫికెటు ఇచ్చాడు.

ఆనాడు రంగయ్య సత్యనారాయణ ఇంటిలో మకాము వేయవలసి వచ్చింది. మరునాడు ముస్తాబై అసిస్టెంటు ఇంజనీరును సమీపించాడు. "సార్! ఈ ట్రూకాపీలమీద సంతకం చేయండి!" ఇంజనీరు విసుగు చూపించాడు. "ఏమయ్యా? అందరు నామీద పచ్చిపడితే ఎలా? ఇంకా నలుగురైదుగురు గజెటెడ్ ఆఫీసర్లున్నారే, వాటిదగ్గరకు పోకూడదూ..." "పోయానండి. వారు మీ మాదిరే చెప్పారు" బొంకాడు రంగయ్య చివరకు ఇంజనీరుగారు సంతకంచేశారు. సాయంత్రమునకు కావలసిన సర్టిఫికెట్లు సేకరించి స్వగ్రామమునకు బయలుదేరాడు రంగయ్య.

దరఖాస్తు పంపిన పదిరోజులకు ఇంటర్వ్యూకి రావలసిందని పిలుపు వచ్చింది. ఆ రోజు రంగయ్య పొందిన ఆనందం చెప్పనలవిగాదు. తాను డాక్టరయినట్లుగా ముసిముసి నవ్వులు నవ్వి, పిలుపు నంగీకరించి, పాతికరూపాయల ధనముతో బయల్దేరాడు.

ఇంటర్వ్యూకి చాలామంది విద్యార్థులువచ్చారు. అందరూ రంగయ్య మార్కులు చూచి ఈర్ష్యతో నిరుత్సాహ మొందారు. ఖద్దరుధారు లనేకమంది తమతమవారిని తీసుకొచ్చారు. బహుశా దొడ్డిదారిన ప్రవేశించటానికేమో! ప్రముఖ రాజకీయ నాయకులలో కొంతమంది విద్యార్థులను వెంట తీసుకుని, నిలబడి ఉన్నారు. అప్పుడే గుసగుసలు బయల్దేరాయి. "ఫలానా మంత్రి నలుగురికి సిఫారసు కాగితాలు వ్రాసి ఇచ్చాడట" అని. అందు, అసత్యమునకు తావులేదని సిఫారసు లేని విద్యార్థుల గట్టినమ్మిక. రంగయ్య అనుకున్నాడు "ఉండే 140 సీట్లను నూటికి 60 సీట్లు ప్రత్యేక తరగతులవారికి కేటాయించబడినాయ్. మిగతా 60 సీట్లలో నా కొకటి రావటం అసంభవమేమో."

ఇంటర్వ్యూలో అన్నారు "నీకు గ్రూపులో నూటికి 68 మార్కులు మాత్రమే వచ్చాయి. నీకెలా వస్తుంది సీటు?" రంగయ్య గుండె దిగజారి పోయింది.

సీటుకోసం నాలుగయిదు దినములు మాత్రం అత్యంతాతురత చూపాడు. చివరకు తేలింది తనకు సీటివ్వలేదని!

★